- సంగమేశ్వరాలయంలో చివరి పూజలు

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల సమీపంలో సప్తనదుల సంగమ ప్రాంతంలో వెలిసిన సంగమేశ్వరాలయంలో సోమవారం చివరి పూజలు నిర్వహించారు. అర్చకుడు రఘురామశర్మ వేపధార లింగానికి సప్తనదుల జలాలతో అభిషేకం చేశారు. గర్భగుడి ఎదుట నిత్యహారతి దీపాన్ని వెలిగించి సప్త నదులకు చీరసారె సమర్పించారు. – కొల్లాపూర్

ఇరిగేషన్‌శాఖలో బదిలీల రగడ..

- సీనియర్లు జిల్లాలకు
- కేంద్ర కార్యాలయాలకు జూనియర్లు
- ఉన్నతాధికారుల తీరుపై ఇంజినీర్ల ఆగ్రహం

హైదరాబాద్, జూలై22 (నమస్తే తెలంగాణ): నీటిపారుదల శాఖలో బదిలీల అంశం ఇంజినీర్ల మధ్య రగడకు దారితీస్తున్నది. హైదరాబాద్ సర్కిల్‌లో చేపడుతున్న బదిలీలపై అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. జీవో 80 ప్రకారం కౌన్సెలింగ్ చేపట్టాలని, ఆప్షన్స్ పెట్టుకున్న ఉద్యోగుల అభిప్రాయాలు తెలుసుకోవాలని స్పష్టంగా నొక్కిచెప్పింది. యూనిట్ పరిధిలో ఉన్న సర్కిల్స్‌కి, డివిజన్స్ జాబితాను విడుదల చేశారు. అందులో ఆయా కార్యాలయాల వారు తమ అభిప్రాయాలను, వర్క్ లోడ్, వారి కార్యాలయంలో అనుభవమున్న ఉద్యోగుల అవసరం తదితర వివరాలను నిబంధనల మేరకే సమర్పించారు. ఆచరణలో నివేదికను తుంగలో తొక్కారని ఇరిగేషన్ ఇంజినీర్లు, ఉద్యోగులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ యూనిట్‌లో ఉన్న కార్యాలయాల్లో అర్హతలు, అనుభవమున్న అధికారులను కాదని, జూనియర్లకు అవకాశం కల్పించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ సూపరింటెండెంట్ చక్రం తిప్పుతున్నారని ఆరోపిస్తున్నారు. సదరు ఉద్యోగి ఇప్పటికే అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయినా తీరు మార్చుకోవడంలేదని మండిపడుతున్నారు. ప్రభుత్వం బదిలీలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

పదోన్నతులను సమీక్షించాలి

- ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీకి తెలంగాణ విద్యుత్తు బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ వినతి

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు సంస్థల్లో పదోన్నతులను సమీక్షించాలని విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ సోమాజిగూడలోని విద్యుత్‌సౌధలో సోమవారం సీఎండీ రోనాల్డ్‌రోస్‌కు విజ్ఞప్తి చేశారు. రెండేండ్లుగా పదోన్నతులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగుల సీనియారిటీని మెరిట్ ప్రాతిపదికన నిర్ధారించాలని, అన్ని నిబంధనలు, కోర్టుల తీర్పులు ఇదే సూచిస్తున్నాయని చెప్పారు. సీనియార్టీలను గుర్తించని కారణంగా జూనియర్ లైన్‌మెన్ క్యాడర్‌లోనే 3,600 మందికి పదోన్నతి రావాల్సి ఉన్నదని తెలిపారు. ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ఎవరికీ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని సీఎండీ హామీ ఇచ్చినట్టు జేఏసీ నేతలు చెప్పారు. చైర్మన్ కుమారస్వామి, కన్వీనర్ వెంకన్నగౌడ్, కో చైర్మన్ సుధాకర్ రెడ్డి, కోకన్వీనర్ భానుప్రకాశ్, నాయకులు సంపత్‌రెడ్డి, హక్‌సాబ్, బ్రహ్మేంద్ర రావు, శ్రీనివాస్, రాజేందర్, సదానందం, అశోక్‌కుమార్, విజయకుమార్, యాదగిరి, చంద్రుడు, సామల శివాజీ పాల్గొన్నారు. అలాగే విద్యుత్తు సంస్థల్లో పదోన్నతులు కల్పించాలని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జేఏసీ రోనాల్డ్ రోస్‌కు వినతిపత్రం అందజేసింది. టీఈఈ జేఏసీ చైర్మన్ ప్రకాశ్, కన్వీనర్ శివాజీ, కో చైర్మన్ అంజయ్య పాల్గొన్నారు.

పోస్టు స్మిత వ్యక్తిగతమా.. ప్రభుత్వ ఆలోచనా?

- రేవంత్‌రెడ్డి సర్కారు స్పష్టతనివ్వాలి
- ఎవరిని తీసుకోవాలో చెప్పే అధికారం ఆమెకెక్కడిది?
- ఉద్యోగంలో ఎన్నిసార్లు పరుగెత్తి పనిచేసినవ్?
- దివ్యాంగులకు స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి
- కోడ్ ఆఫ్ కండక్ట్ కింద ఆమెపై చర్యలు తీసుకోవాలి
- సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకురాలు బాల లత

ఖైరతాబాద్, జూలై 22 : 'దివ్యాంగులు ఎయిర్‌లైన్స్‌లో పనికి రారు.. సివిల్ సర్జన్లుగా అక్కరకురారు అని చెప్పే అధికారం ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌కు ఎక్కడిది? ఆమె కున్న అధికారం ఏమిటి? ఎవరిని సర్వీసులోకి తీసుకోవాలో చెప్పేందుకు ఆమె ఎవరు?' అని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకురాలు బాల లత ప్రశ్నించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ దివ్యాంగులపై స్మితా సబర్వాల్ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు చెప్పారు. ఓ ఐఏఎస్ అధికారి స్థాయిలో వ్యక్తిగతంగా ఈ వ్యాఖ్యలు చేశారా? లేక ప్రభుత్వ ఆలోచనగా చెప్పారా? అని నిలదీశారు. ఒకవేళ ప్రభుత్వం తరపున చెప్పాలనుకుంటే కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పాటించారా? లేదా? చెప్పాలని ప్రశ్నించారు. కొందరు సివిల్ సర్వీస్ ఉద్యోగులు తమ ఐడెంటిటీ కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది కోడ్ ఆఫ్ కండక్ట్‌కు వ్యతిరేకమని చెప్పారు. ఆమె వ్యాఖ్యలు యావత్ దేశంలోని దివ్యాంగులను కించపరిచేలా ఉన్నాయని, దివ్యాంగ సమాజాన్నే అవమానపర్చే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు దివ్యాంగులు ఐఏఎస్, ఐపీఎస్ అయ్యేందుకు ఫిజికల్‌గా ఫిట్‌నెస్ కావాలా? లేక మెంటల్‌గానా అన్నది స్పష్టం చేయాలని, ఆమె ఉద్యోగంలో ఎన్ని సార్లు పరుగెత్తి పనిచేశారు?, ఎన్ని రోజులు ఫీల్డ్ వర్క్ చేశారో చెప్పాలని నిలదీశారు. సీఎం అయిన తర్వాత రేవంత్‌రెడ్డి మొట్టమొదటి అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఓ దివ్యాంగురాలికి ఇచ్చారని, ఆమెకు అర్హత ఉందా? లేదా? చూసుకొని ఏమైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు.

సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలి

2016 దివ్యాంగుల చట్టం ప్రకారం దివ్యాంగుల గురించి ఇలా రాయడం నేరమని, ఆమెపై కండక్ట్ ఆఫ్ సివిల్ సర్వీస్ కింద చర్యలు తీసుకోవాలని బాల లత డిమాండ్ చేశారు. దివంగత మంత్రి జైపాల్‌రెడ్డి సౌత్ ఇండియా నుంచి బెస్ట్ పార్లమెంటేరియన్ అవార్డు తీసుకున్నారని గుర్తుచేశారు. జైపాల్‌రెడ్డి తన గురువు అని చెప్పుకొనే సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఎవరూ దివ్యాంగ సర్టిఫికెట్‌తో ఉద్యోగాలు తెచ్చుకోలేదని, యూపీఏఎస్సీలో తనకు వచ్చిన మార్క్స్ షీట్స్ చూపిస్తానని చెప్పారు. ఐఏఎస్‌లు కావాలంటే అందగత్తెలు, ఐపీఎస్‌లు కావాలంటే జిమ్‌ట్రైన్డ్స్ సరిపోతారా? అని ప్రశ్నించారు. స్మితా సబర్వాల్ శారీరకంగా ఫిట్‌గా ఉన్నా ఆమెకు మానసిక స్థితి బాగా లేదని తెలుస్తున్నదని చెప్పారు. స్మితా సబర్వాల్ తన పోస్టుకు రాజీనామా చేసి వస్తే ఇద్దరం కలిసి మళ్లీ సివిల్స్ రాద్దామని, ఎవరికి ఎక్కువ మార్కులు వస్తాయో చూద్దామని, దివ్యాంగులతో కలిసి పరీక్ష రాయాలని సవాల్ చేశారు. 24 గంటల్లో ఆమె తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, దివ్యాంగుల సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. లేదంటే జైపాల్‌రెడ్డి స్మృతివనం వద్ద ఆమరణ నిరాహారదీక్ష చేపడుతామని హెచ్చరించారు.

స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి

దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి

హైదరాబాద్, జూలై22 (నమస్తే తెలంగాణ): సివిల్ సర్వీసెస్‌లో దివ్యాంగులకు రిజర్వేషన్ అవసరమా? అంటూ ఎక్స్ వేదికగా ఐఏఎస్ స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు హేయమని, ఇది దివ్యాంగులను కించపరచడమేనని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి విమర్శించారు. వెంటనే ఆమె దివ్యంగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రకటన విడుదల చేశారు. దివ్యాంగులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను వద్దనే హక్కు ఆమెకు ఎక్కడిదని ప్రశ్నించారు. స్మితా సబర్వాల్‌పై దివ్యాంగుల హక్కుల రక్షణ చట్టం 2016 ప్రకారం కేసు నమోదు చేయాలని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోండి

- ఆమె బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- దివ్యాంగులు, వివిధ సంఘాల నాయకులు డిమాండ్
- డీజీపీకి వీహెచ్‌పీఎస్ నేతల వినతి
- జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

నిరసన తెలుపుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్, అడివయ్య తదితరులు

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ)//చిక్కడపల్లి : దివ్యాంగులను కించపర్చేలా ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు చేశారని, ఆమెపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వికలాంగుల హక్కుల పోరాట సమితి నేతలు డీజీపీ జితేందర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. వీహెచ్‌పీఎస్ చైర్మన్ అందె రాంబాబు, రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య మాట్లాడుతూ 'దివ్యాంగులు విమానాలు నడపగలరా? శస్త్ర చికిత్సలు సరైన పద్ధతిలో చేయగలరా? తగు సామర్థ్యాలు లేని వారిని ఆల్ ఇండియా సర్వీసుల్లోకి ఎలా తీసుకుంటారు' అని స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు తమను తీవ్రంగా బాధపెట్టాయని తెలిపారు. అవమానించేలా మాట్లాడిన ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలసీకి వ్యతిరేకంగా మాట్లాడడమంటే నిబంధనలు ఉల్లంఘించటం కాదా? అని నిలదీశారు. ఆమెపై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకోకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కోర్ కమిటీ చైర్మన్ ఎల్ గోపాలరావు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ ఖండన

స్మితా సబర్వాల్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని, దివ్యాంగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. 'ప్రతిభ అనేది ఎవరి సొత్తు కాదు. వైకల్యాలు, శక్తి సామర్థ్యాలు మేధోశక్తిపై ప్రభావం చూపవు. ఓ ఐఏఎస్ అధికారి దివ్యాంగులపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తన స్థాయిని దిగజారుస్తున్నది. బ్రెయిలీ లిపిని అందించిన లూయిస్ బ్రెయిలీ మొదలు అనేక మంది సివిల్ సర్వెంట్లు, రాజకీయవేత్తలు, డాక్టర్లు వారి రంగాల్లో తమ శక్తి సామర్థ్యాలను చాటుతూ ఉన్నతస్థాయి సేవలందిస్తున్న వాస్తవం మనకండ్లముందున్నది' అని పేర్కొన్నారు.

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో నిరసన

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే వెంకటేశ్, అడివయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో నిరసన తెలిపారు. దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో రిజర్వేషన్ అవరసం లేదని ప్రకటించడం ఆమె అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. కేంద్ర సర్వీస్ నియామకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ అమలు చేయాలని కోర్టు తీర్పులున్నాయనే విషయం తెలియకుండా ఐఏఎస్ ఎలా అయ్యారని ప్రశ్నించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మమత, వెంకటేశ్, ఎం.శోభన్, రమేశ్, జగదీశ్, గంగమ్మ, రాజు, పవన్, నర్సింగ్, శంకర్‌గౌడ్, శ్రీను, రఘు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు

స్మిత సబర్వాల్‌పై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ)కు కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ ఫిర్యాదు చేశారు. దేశంలోని కోట్లాదిమంది దివ్యాంగుల మనోభావాలను, భారత రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులను భంగపరిచేలా స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమెపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్‌ఆర్‌ఆర్ పనుల్లో వేగం పెంచండి

కేంద్ర కార్యదర్శికి మంత్రి కోమటిరెడ్డి వినతి

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) పనులు త్వరితగతిన చేపట్టేలా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ(మోర్త్) కార్యదర్శి అనురాగ్ జైన్‌కు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో అనురాగ్ జైన్‌తో సమావేశమైన మంత్రి.. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారుల ప్రాజక్టులపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చే ప్రతిపాదనలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. స్పందించిన అనురాగ్ జైన్.. వారంలో ఎస్ఎఫ్‌సీ ప్రక్రియను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి హరిచందన ఉన్నారు.

ప్రారంభానికి ముందే చెక్‌డ్యాంలో లీకేజీ

మద్దూర్ (కొత్తపల్లి), జూలై 22: నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం లింగాల్‌చేడ్ గ్రామ వాగులో రేవంత్ సర్కారు రూ.8.40 కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనుల్లో కాంట్రాక్టర్ దొల్లతనం బయటపడింది. ఇటీవల కురిసిన వర్షాలతో అందులోకి నీళ్లు చేరగా లీకేజీ దర్శనమిచ్చింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఇరిగేషన్ డీఈ ఆనంద్‌కిశోర్ సోమవారం చెక్‌డ్యాంను పరిశీలించారు. ఎక్స్‌ప్యాన్సన్ జాయింట్ వద్ద లీకేజీ ఉన్నదని గుర్తించారు. చెక్‌డ్యాంలో నీటిమట్టం తగ్గిన తర్వాత పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

ఉగ్ర గోదావరి.. కృష్ణమ్మ పరవళ్లు

- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- కాళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను దాటి ప్రవాహం
- జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు పోటెత్తుతున్న వరద
- రాబోయే రెండు రోజుల్లో మరింతగా పెరగనున్న వరద

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం వెంచపల్లిలో నీట మునిగిన పత్తి పంట

న్యూస్‌నెట్‌వర్క్/ హైదరాబాద్, జూలై22 (నమస్తే తెలంగాణ): కర్ణాటక, మహారాష్ట్రతోపాటు తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో గోదావరి, కృష్ణా నదులు ఉప్పొంగుతున్నాయి. ప్రాణహిత నుంచి భారీగా వరద వచ్చి గోదావరిలో కలుస్తున్నది. లక్ష్మీబరాజ్ వద్ద 10 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతున్నది. సోమవారం మధ్యాహ్నం వరకే 103.55 మీటర్ల మేర వరద ప్రవాహం నమోదు కావడంతో కాళేశ్వరం వద్ద అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. దిగువన ఇంద్రావతి, తాలిపేరు, కిన్నెరసాని నుంచి భారీగా వరద వస్తుండటంతో భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం క్రమేపీ పెరుగుతున్నది. నీటి ప్రవాహం 48 అడుగుల స్థాయికి చేరుకోవడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. సోమవారం రాత్రి 10 గంటలకు గోదవారి ప్రవాహం 50.01 అడుగులకు చేరినట్టు అధికారులు తెలిపారు. వరద మరింత పెరిగే అవకాశముండటంతో ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఎగువన ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు సైతం వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. భద్రాద్రి జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం భద్రాచలం వచ్చిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.. తొలుత కరకట్ట పనులను పర్యవేక్షించారు. తరువాత వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వరద సమీక్షలో ఆయన మాట్లాడారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, ఆర్డీవో దామోదర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ పరవళ్లు

కర్ణాటకలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నది. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు భారీగా వరద వచ్చి చేరుతుండగా గేట్లన్నీ ఎత్తి దిగువ విడుదల చేస్తున్నారు. ఆయా ప్రాజెక్టులకును దాటుకుని జూరాలకు, అక్కడి నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు కృష్ణమ్మ ప్రవాహిస్తున్నది. ఆదివారం సాయంత్రానికి జూరాల ప్రాజెక్టుకు 1.11 లక్షల క్యూసెక్కుల వరద రాగా సోమవారం సాయంత్రానికి 1.69 లక్షల క్యూసెక్కులకు, శ్రీశైలం ప్రాజెక్టుకు 96 వేల క్యూసెక్కుల నుంచి 1.74 లక్షల క్యూసెక్కులకు వరద ప్రవాహం పెరిగింది. మరోవైపు తుంగభద్రకు భారీగా వరద వస్తుండటంతో 3 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. రాబోయే 24 గంటల్లో శ్రీశైలం ప్రాజెక్టుకు మరింత వరద ప్రవాహం పెరిగే అవకాశముంది.

ముంచెత్తిన వరద

దహెగాం/నెన్నెల/వేమనపల్లి/కోటపల్లి/చింతలమానేపల్లి, జూలై 22: ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు నదులు, ప్రాజెక్టులు, వాగులు.. వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండగా.. పరీవాహక ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. దహెగాం మండలంలో ప్రాణహిత, పెద్దవాగు బ్యాక్‌వాటర్‌తో రావుపల్లి, మొట్లగూడ, రాంపూర్, దిగడల్లో వెయ్యి ఎకరాల పత్తి నీట మునిగింది. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో చేలల్లో ఇసుక మేటలు వేశాయి. మొలకలు కొట్టుకుపోయి నష్టం వాటిల్లింది. సోమవారం మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ పంటలను పరిశీలించారు. కల్లెంపల్లి, ముక్కిడిగూడెం, జాజులపేట, రాచర్ల సమీపంలో 400 ఎకరాల్లో పత్తి పంటలు మునిగిపోయాయి. కోటపల్లి మండలంవెంచపల్లి, సూపాక, ఆలుగామ, జనగామ, పుల్లగామ, సిర్సా, అన్నారం, ఎదుల్లబంధం, అర్జునగుట్టలో 864 ఎకరాల పంటలకు నష్టం జరిగినట్టు కోటపల్లి ఏవో తెలిపారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో దిందా–కేతిని వాగు ప్రాణహితతో పాటు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దిందా నాలుగో రోజూ జలదిగ్బంధంలోనే ఉంది. గూడెం–అహేరి అంతర్రాష్ట్ర వంతెన వద్ద ప్రాణహిత నిండుగా ప్రవహిస్తున్నది. ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మత్స్యకారులు నదిలోకి చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.

అధికారుల తప్పంటే శిక్ష తప్పదు

- అప్రమత్తంగా ఉంటే ఇంత నష్టం జరిగేది కాదు
- 'పెదవాగు' తక్షణ సహాయానికి రూ.8.50 కోట్లు
- అశ్వారావుపేట పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

అశ్వారావుపేట టౌన్, జూలై 22: పెదవాగు ప్రాజెక్టు కట్ట తెగిపోవడం తీరని నష్టమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విచారం వ్యక్తంచేశారు. అధికారులు సకాలంలో స్పందించి ఉంటే ఇంతటి ప్రమాదం వాటిల్లేదికాదని అన్నారు. తక్షణ సహాయ చర్యల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.8.50 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. మండలంలోని గుమ్మడివల్లి సమీపంలో ఉన్న పెదవాగు ప్రాజెక్టు ఇటీవల తెగి ఆయకట్టు రైతులు, స్థానిక ప్రజలు తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో ఆయా గ్రామాల్లో మంత్రి పొంగులేటి సోమవారం పర్యటించారు. కొట్టుకుపోయిన పంటలను, ఇసుక మేటలు వేసిన పొలాలను, దెబ్బతిన్న ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి మాట్లాడారు. ఈ ప్రాజెక్టు కింద 16 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా.. రాష్ట్రంలో 3,200 ఎకరాలు మాత్రమే సాగవుతున్నాయని, మిగిలిన 13 వేల ఎకరాలు ఆంధ్రాలోనే సాగవుతున్నాయని వివరించారు. ఈ ప్రాజెక్టుపై ఏపీ శ్రద్ధ చూపకపోవడంతో తెలంగాణ ప్రభుత్వమే రూ.2.5 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. అధికారుల నిర్లక్ష్యంపై విచారణ చేపడతామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు కట్ట తెగిపోవడంతో 400 ఎకరాల్లో ఇసుక మేటలు వేసిందని, ఇసుక మేటలను తొలగించేందుకు ఎకరానికి రూ.10 వేలు అందజేస్తామని చెప్పారు. పొంగులేటి రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నీటమునిగిన గుడిసెలకు రూ.10 వేలు, ఆర్‌సీసీ స్లాబ్ ఇండ్లకు రూ.5 వేలు సాయంగా అందిస్తామని తెలిపారు.

స్మార్ట్ సిటీల్లో తెలంగాణకు అన్యాయం

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని, స్మార్ట్ సిటీల విషయంలో తెలంగాణకు అన్యాయం చేసిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. సచివాలయంలోని మీడియా పాయింట్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో విభజన హామీల అమలుకు నిధులు కేటాయించేలా రాజకీయాలకు అతీతంగా చొరవ చూపాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని డిమాండ్ చేశారు. సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రానికి రావాల్సిన ప్రతి రూపాయి గురించి అడుగుతున్నామని, కేంద్రానికి సహకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగానే ఉన్నదని స్పష్టం చేశారు.

విస్తరణ, పీసీసీ ఊసే లేదు

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో పార్టీ పెద్దలు, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర నేతలు బిజీగా ఉండటంతో పాటు ఆషాడ మాసం కారణంగా రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి నియామకంపై చర్చించలేదని సమాచారం. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిశాక శ్రావణమాసంలోనే నిర్ణయం తీసుకుందామని సీఎం అధిష్ఠానం ముందే చెప్పటంతో వాటిని ప్రస్తావించలేదని తెలిసింది. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అ ధ్యక్షుడి ఎంపికపై సీఎం తన అభిప్రాయాన్ని అధిష్ఠాన పెద్దలకు తెలియజేయటంతో నిర్ణయాన్ని వారికే వదిలేసినట్టు సమాచారం.

మూసీ అభివృద్ధికి 10 వేల కోట్లివ్వండి

- జల్‌జీవన్ మిషన్‌కూ నిధులు విడుదల చేయండి
- ఓఎంసీలకు ముందుగానే గ్యాస్ సబ్సిడీ చెల్లించే అవకాశమివ్వండి
- పౌర సరఫరాల శాఖ బకాయిలు విడుదల చేయండి
- కేంద్రానికి సీఎం రేవంత్ వినతులు



కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్‌పూరీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం చేపట్టే మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు జాతీయ నదీ పరిరక్షణ ప్రణాళిక కింద రూ.10 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీనదిని దేశంలో మరెక్కడా లేనివిధంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, హర్దీప్‌సింగ్ పూరీ, ప్రహ్లాద్‌జోషితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. మూసీలో కలిసే మురుగునీటి శుద్ధి పనులకు రూ.4 వేల కోట్లు, గోదావరి జలాలను ఉస్మాన్